# వేగుచుక్క

VC NEWS

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 22 సెప్టెంబర్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 77

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## కోర్టు ఉత్తర్వులే అంతిమం



హైదరాబాద్: న్యాయస్థానం ఉత్తర్వులకు విరుద్ధంగా పాలనా యంత్రాంగం వ్యవహరించడానికి వీల్లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగానే రికార్డులు ఉండాలంది. రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం చటాన్‌పల్లి సర్వే నంబర్లు 626, 638, 639, 640లలోని 32.26 ఎకరాలు వక్ఫ్ భూమి కాదని ఈ కోర్టు ఆదేశాలున్నా నిషేధిత జాబితాలో కొనసాగించడాన్ని తప్పుబట్టింది.



2లో

## జూరాల కింద

### ఒక్క ఎకరం ఎండినా

## ప్రభుత్వానిదే బాధ్యత

### కాంగ్రెస్ నాయకుల డ్రామాలు



2లో

## జూరాల గేట్లు వెంటనే తెరవాలి



## కేదారి కుటుంబానికి సాయం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

### సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.10 లక్షలు

### లింగాల కేదారి సేవల స్మరణ

**హనుమకొండ, సెప్టెంబర్ 21 :**

తెలంగాణ మలిదశ ఉద్యమంలో అంకితభావంతో సేవలందించిన దివంగత లింగాల కేదారి, ఆయన భార్య దివంగత పుష్పలత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉద్యమ కాలంలో కేదారి దంపతులు చేసిన సేవలను గుర్తిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులను కొంతవరకు తగ్గించేందుకు ఈ సాయం ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన కుటుంబ సభ్యులకు సహాయం త్వరగా



## నగరాలే ఖనిజాల కొత్త నిల్వలు

### ఈ వ్యర్థాల పునర్వినియోగంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపు

### ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి మద్దతు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 :**

భారత్‌కు అవసరమైన తదుపరి ఖనిజ సంపద భూగర్భంలో కాకుండా నగరాల్లోనే ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. ఈ-వ్యర్థాలు, వినియోగం ముగిసిన బ్యాటరీలు, సౌర ఫలకాలో విలువైన విమర్శనాత్మక ఖనిజాలు దాగి ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని సమర్థంగా తిరిగి సేకరించడం ద్వారా దేశం (మిగతా 2వ పేజీలో)

## నష్టాల నుంచి లాభాల బాటలో...

# ఏపీఎచ్ఎంఈఎల్



ఒకప్పుడు రూ.21 కోట్లకు పైగా నష్టాలతో మూతపడే పరిస్థితికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ ప్రస్తుతం లాభాల బాటలో దూసుకుపోతోంది. సింగరేణి ఆధీనంలోకి వచ్చిన తర్వాత సంస్థ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పటివరకు సంస్థ రూ.60.85 కోట్ల సంచిత లాభాలను నమోదు చేయగా, అందులో గత మూడేళ్లలోనే రూ.34.20 కోట్ల నికర లాభాలు ఆర్జించడం విశేషంగా నిలిచింది.

### మూడేళ్లలో రూ.34.20 కోట్ల నికర లాభాలు

### రికార్డు స్థాయిలో ఆర్థిక ప్రగతి.. జాతీయ స్థాయికి విస్తరిస్తున్న సంస్థ

### సింగరేణి ఆధ్వర్యంలో విజయ ప్రస్థానం

హైదరాబాద్ , సెప్టెంబర్ 21: ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన అభివృద్ధి చర్యలు సంస్థకు కొత్త ఊపునిచ్చాయి. జాతీయ స్థాయిలో పోటీ పడే సంస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో పలు కార్యక్రమాలు అమలు చేశారు. దీంతో ఏపీఎచ్ఎంఈఎల్ తన ఆర్థిక స్థితిని గణనీయంగా మెరుగుపరుచుకుంది. ఏపీఎచ్ఎంఈఎల్ గత మూడు ఆర్థిక సంవత్సరాలుగా వరుసగా లాభాలను తరువాయి 2 వ పేజీలో..



## రైతులకు రూ.813 కోట్ల పరిహారం చెల్లించాలి

### భూసేకరణ నిధులు ఖాతాల్లో నిల్వ ఉండొద్దు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

### పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు

సాగునీటి ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన రూ.813 కోట్ల పరిహారాన్ని తక్షణమే పంపిణీ చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ, పునరావాసం కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులు రైతులకు చేరకుండా అధికారుల ఖాతాల్లో నిల్వ ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారంజిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూసేకరణ, పరిహారం చెల్లింపుల పురోగతిని సమీక్షించారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :**

ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు భూసేకరణ, పునరావాసం కోసం రూ. 3,101 కోట్ల విలువైన టోకెన్లు సమర్పించగా, ప్రభుత్వం రూ. 2,504 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో రూ. 502 కోట్లు భూసేకరణ అధికారుల వద్ద, మరో రూ. 311 కోట్లు జిల్లా కలెక్టర్ల వద్ద (మిగతా 2వ పేజీలో)



### దానం అనర్హతపై సుప్రీం విచారణ

## హైకోర్టు తీర్పుకు సవాల్

### బుధవారం పిటీషన్‌పై విచారణ

### స్టే కోరనున్న దానం నాగేందర్

### ఖైరతాబాద్ రాజకీయాల్లో ఉత్కంఠ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం ముందుకు చేరింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టులో ప్రత్యేక పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించాలని ఆయన తరఫు న్యాయవాదులు కోరగా, సుప్రీంకోర్టు అందుకు అంగీకారంతరువాయి 2 వ పేజీలో..

## హక్కులతో పాటు బాధ్యతలు అవసరం

### దేశభక్తి క్రమశిక్షణపై గవర్నర్ పిలుపు

### సికింద్రాబాద్‌లో జాతీయ సదస్సు నిర్వహణ

### ఆత్మనిర్భర్ భారత్ పురోగతిపై ప్రశంసలు



సికింద్రాబాద్, సెప్టెంబర్ 21: హక్కులు, బాధ్యతలు రెండూ సమానంగా నడవాల్సిన అవసరం ఉందని తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా అన్నారు. సికింద్రాబాద్‌లోని ఎంసీఈఎంఈ ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్రీయ సైనిక్ సంస్థ 19వ జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, కర్తవ్యబోధ పెంపొందడం అత్యంత అవసరమని తరువాయి 2 వ పేజీలో..



# జూరాల గేట్లు వెంటనే తెరవాలి

**నేడు ప్రాజెక్టును సందర్శిస్తాం: రామచందర్‌రావు**

హైదరాబాద్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతులు నీళ్ల లేక గోస పడుతున్నారని, సర్కారు జూరాల గేట్లను ఎత్తి వెంటనే నీటిని వదలాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ... "ఎల్‌నినో ప్రభావంతో కరవు పరిస్థితులు నెలకొన్నా రాష్ట్ర ప్రభుత్వం జూరాల గేట్లను తెరవకుండా పాలమూరు రైతులను ఇబ్బంది పెడుతోంది. సాగునీటి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మంగళవారం పార్టీ నేతలు, ఇంజినీర్లతో కలిసి ప్రాజెక్టు వద్దకు వెళ్తున్నాం. పోలీసులు సర్కారు చెప్పినట్టు నడుచుకుంటున్నారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యుల అరెస్టును ఖండిస్తున్నాం" అని పేర్కొన్నారు.
ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రానిక
కేంద్రం సాయం అందిస్తుందా? అన్న విలేకరుల ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. రాష్ట్రం కేంద్రానికి ఎలాంటి దరఖాస్తు చేసుకోలేదని, ప్రణాళికాబద్ధంగా అంచనా వేసి అడిగితే కేంద్రం
సాయం చేస్తుందని తెలిపారు. అంతకుముందు ఏటూరునాగారం ఐటీడీఏ మాజీ పీవో చక్రధర్‌రావుతోపాటు, ఉమ్మడి వరంగల్‌కు చెందిన నేతలు రామచందర్‌రావు సమక్షంలో భాజపాలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ధర్మారావు, కొండేటి శ్రీధర్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమక్షంలోనే లబ్ధిదారుల ఎంపిక




హైదరాబాద్: ప్రజల సమక్షంలో అర్హులైన వారందరి పేర్లతో లాటరీ తీసి.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలోని మల్కంచెరువు సమీపంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణానికి మంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. శేరిలింగంపల్లిలో ఇళ్లు ఎంపికైన వారికి కేటాయింపు పత్రాలు అందజేశారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ.. సేల్‌డీడ్‌ను రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందించేలా ప్రభుత్వం నిర్ణయించింది.

**అర్హులందరికీ దశల వారీగా...**

ప్రస్తుతం ఒక్కో నియోజకవర్గంలో తొలి విడతగా 480 ఇళ్ల చొప్పున నిర్మించేలా.. ఇప్పటికే పలుచోట్ల టెండర్లు, ఒప్పంద ప్రక్రియ పూర్తయింది. ఇప్పుడు ఇల్లు రాలేదని అర్హులు నిరాశ
చెందాల్సిన అవసరం లేదు. నగర పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్స్ చేపట్టాం. అర్హులకు రాబోయే రెండున్నరేళ్లలో దశలవారీగా ఇళ్లు అందిస్తాం. రాయదుర్గంలో 8 ఎకరాల్లో నిర్మాణం చేపడుతున్నాం.. అవసరమైతే 13 ఎకరాలకూ విస్తరిస్తాం" అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ రఘునాథ్ యాదవ్, హౌసింగ్ బోర్డు వీసీ గౌతమ్ పాల్గొన్నారు.

**రెవెన్యూ చట్టాలు పటిష్ఠంగా అమలు చేయండి**

ప్రభుత్వం తీసుకొచ్చిన రెవెన్యూ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయడానికి
ఉద్యోగులు మరింత కృషి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం సచివాలయంలో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం(ట్రెసా) నూతన అధ్యక్షుడు కె.గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్‌రెడ్డి నేతృత్వంలో కార్యవర్గ ప్రతినిధులు మంత్రిని కలిశారు.

# రైతులకు రూ.813 కోట్ల పరిహారం చెల్లించాలి

(మొదటి పేజీ తరువాయి

చెల్లింపులకు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. విడుదలైన నిధులు రైతులకు చేరేలా కలెక్టర్లు వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలని మంత్రి సూచించారు.

**భూసేకరణకు రూ.6 వేల కోట్లు**

సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం, అటవీ సంబంధిత అవసరాల కోసం 2026లో రూ.6 వేల కోట్లు సమకూర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సాధారణ నీటిపారుదల బడ్జెట్‌కు అదనంగా ఈ నిధులను సమకూరుస్తున్నట్లు చెప్పారు. నిధుల కొరతతో ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**రైతులకు న్యాయబద్ధమైన పరిహారం**

భూములు కోల్పోతున్న రైతుల పట్ల అధికారులు మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని మంత్రి సూచించారు. చట్టపరమైన నిబంధనలకు లోబడి, సాధ్యమైనంత వరకు ప్రస్తుత మార్కెట్ విలువలకు దగ్గరగా పరిహారం అందించాలని ఆదేశించారు. అవార్డులు జారీ చేసిన తర్వాత పరిహారం చెల్లింపుల్లో జాప్యం జరిగితే, వర్తించే నిబంధనల ప్రకారం వడ్డీ కూడా చెల్లించాలని స్పష్టం చేశారు. కోర్టు కేసులు, భూమి హక్కులకు సంబంధించిన వివాదాల కారణంగా పరిహారం పెండింగ్‌లో ఉన్న సందర్భాల్లో సంబంధిత కేసుల వివరాలను సిద్ధం చేసి, అడ్వకేట్ జనరల్‌తో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. చెల్లింపులకు సిద్ధంగా ఉన్న కేసులకు మాత్రమే టోకెన్లు జారీ చేయాలని ఆదేశించారు.

**పెండ్లిపాక భూసేకరణ వేగవంతం చేయాలి**

నల్గొండ జిల్లాలోని చింతపల్లి రిజర్వాయర్, పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఉదయసముద్రం, నెల్లికల్లు ప్రాజెక్టుల భూసేకరణలో జరుగుతున్న జాప్యాన్ని మంత్రి సమీక్షించారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం పూర్తయిన తర్వాత పూర్తిస్థాయిలో ప్రయోజనం పొందాలంటే పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణ త్వరగా పూర్తి కావాలని స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి, నారాయణపేట, సిద్ధిపేట, వికారాబాద్, జగిత్యాల, హనుమకొండ తదితర జిల్లాల్లో భూసేకరణ సమస్యలను కూడా సమీక్షించారు. దాదాపు పూర్తయిన సాగునీటి ప్రాజెక్టులు చిన్నచిన్న భూసేకరణ సమస్యలు, అనుసంధాన కాలువల పనుల కారణంగా నిలిచిపోకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా, భూసేకరణ కమిషనర్ శివకుమార్ నాయుడు, పలువురు జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# దానం అనర్హతపై సుప్రీం విచారణ హైకోర్టు తీర్పుకు సవాల్

మొదటి పేజీ తరువాయి

తెలిపింది. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా చర్చనీయాంశంగా మారింది. హైకోర్టు తీర్పు అనంతరం ఏర్పడిన రాజకీయ, న్యాయ పరిణామాలపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట దానం నాగేందర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైకోర్టు తీర్పు వల్ల తక్షణ ప్రభావాలు ఏర్పడే అవకాశం ఉందని, అందువల్ల అత్యవసర విచారణ అవసరమని ఆయన ధర్మాసనానికి వివరించారు. వాదనలు పరిశీలించిన ధర్మాసనం పిటిషన్‌ను బుధవారం, సెప్టెంబర్ 23న విచారణకు తీసుకుంటామని ప్రకటించింది. దీంతో దానం నాగేందర్‌కు తాత్కాలిక ఉపశమనం లభించే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ విచారణ ఫలితం భవిష్యత్తు పరిణామాలను ప్రభావితం చేసే అవకాశముంది. హైకోర్టు తీర్పు అమల్లో కొనసాగితే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా పరిగణించే పరిస్థితి ఏర్పడవచ్చని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు భావిస్తున్నారు. ఆ పరిస్థితిలో ఎన్నికల సంఘం ఉపఎన్నికల ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉందని వారు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లనున్నారు. అందువల్ల హైకోర్టు ఉత్తర్వులపై తక్షణమే స్టే విధించాలని వారు కోరనున్నారు. ఒకవేళ సుప్రీంకోర్టు స్టే మంజూరు చేస్తే ప్రస్తుత పరిస్థితి యథాతథంగా కొనసాగవచ్చు. లేదంటే ఖైరతాబాద్ నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు మరింత వేగంగా మారే అవకాశముంది. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికై మరో పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేయడం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని ప్రత్యర్థి పార్టీలు ఆరోపించాయి. ఇదే వివాదం చివరకు న్యాయస్థానాల దాకా వెళ్లింది. దానం నాగేందర్ వ్యవహారంపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి న్యాయపోరాటం ప్రారంభించారు.

# నగరాలే ఖనిజాల కొత్త నిల్వలు

(మొదటి పేజీ తరువాయి

ఆత్మనిర్భరత దిశగా ముందుకు సాగుతుందని తెలిపారు. భారత్‌లో విమర్శనాత్మక ఖనిజాల పునర్వినియోగ వ్యవస్థ, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ అంశాలపై నిర్వహించిన జాతీయ సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఖనిజాల రీసైక్లింగ్ రంగంలో మరింత భాగస్వామ్యం అవసరమని పరిశ్రమలు, రీసైక్లింగ్ సంస్థలకు పిలుపునిచ్చారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, పాత బ్యాటరీలు, వినియోగం ముగిసిన సౌర ప్యానెల్లలో లిథియం, కోబాల్ట్, నికెల్, రాగి వంటి కీలక ఖనిజాలు ఉన్నాయని మంత్రి వివరించారు. వీటిని తిరిగి వెలికితీసి వినియోగించడం ద్వారా దిగుమతులపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుందని పేర్కొన్నారు. దేశంలో వేగంగా పెరుగుతున్న సాంకేతిక వినియోగంతో పాటు ఈ-వ్యర్థాల పరిమాణం కూడా పెరుగుతోందని తెలిపారు. ఈ పరిస్థితిని సవాలుగా కాకుండా అవకాశంగా మార్చుకోవాలని సూచించారు. వ్యర్థాలను విలువైన వనరులుగా మార్చే విధానాలు భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. వృత్తాకార ఆర్థిక వ్యవస్థ ద్వారా వనరుల సమర్థ వినియోగం, పర్యావరణ పరిరక్షణ, పారిశ్రామిక అభివృద్ధి ఒకేసారి సాధ్యమవుతాయని మంత్రి అభిప్రాయపడ్డారు.

# హక్కులతో పాటు బాధ్యతలు అవసరం

మొదటి పేజీ తరువాయి

గవర్నర్ పేర్కొన్నారు. దేశం పట్ల అంకితభావంతో పనిచేసే తరం రూపుదిద్దుకుంటే భారతదేశం మరింత శక్తివంతమైన దేశంగా ఎదుగుతుందని చెప్పారు. సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని ఆయన వివరించారు. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం కింద రక్షణ రంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధిస్తోందని గవర్నర్ తెలిపారు. స్వదేశీ సాంకేతికతతో ఆధునిక రక్షణ సామగ్రి తయారీలో దేశం ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. స్వయం సమృద్ధి దిశగా సాగుతున్న ఈ ప్రయాణం దేశ భద్రతను మరింత బలోపేతం చేస్తోందని అన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులు, మాజీ సైనికులు, అమరవీరుల కుటుంబాల సేవలను ఎప్పటికీ మరువకూడదని గవర్నర్ స్పష్టం చేశారు. వారి త్యాగాల వల్లే దేశ ప్రజలు సురక్షితంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. సైనికుల సేవలకు సమాజం ఎల్లప్పుడూ గౌరవం ఇవ్వాలని సూచించారు. స్వామి వివేకానంద సందేశాలను ప్రస్తావించిన గవర్నర్, లక్ష్య సాధన వరకు నిరంతర కృషి చేయాలని యువతకు సూచించారు. "లేచి నిలబడండి, మేల్కొనండి, లక్ష్యం చేరుకునే వరకు ముందుకు సాగండి" అనే సందేశం ప్రతి యువకుడికి స్ఫూర్తినివ్వాలని అన్నారు. కష్టపడి పనిచేసే వ్యక్తులే విజయాన్ని అందుకుంటారని పేర్కొన్నారు. ఈ సదస్సులో దేశభక్తి, జాతీయ భద్రత, యువత పాత్ర, మాజీ సైనికుల సంక్షేమం వంటి అంశాలపై చర్చించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. దేశ నిర్మాణంలో పౌరుల బాధ్యతలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వక్తలు నొక్కి చెప్పారు.

# రామమందిర విరాళాల కేసులో సంచలనం

మొదటి పేజీ తరువాయి

తొలి అభియోగ పత్రాన్ని దాఖలు చేసే అవకాశముందని సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలియజేశారు. మొదటి అరెస్టు జరిగిన తేదీ నుంచి 90 రోజుల గడువు ముగియకముందే చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విరాళాల వ్యవహారంపై ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత ఆలయ పరిపాలనా వ్యవస్థలో మార్పులు చేపట్టినట్లు సమాచారం. పరిపాలనను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు కొత్త కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు నివేదికల్లో పేర్కొన్నారు. సిట్ నివేదిక ప్రతిని తమకు అందజేయాలని పిటిషనర్లు కోరినప్పటికీ, ఈ దశలో నివేదికను బహిర్గతం చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. దర్యాప్తు, తదుపరి న్యాయ ప్రక్రియలకు భంగం కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోర్టు పేర్కొంది.

# నష్టాల నుంచి లాభాల బాటలో... ఏపీహెచ్ఎంఈఎల్

మొదటి పేజీ తరువాయి

నమోదు చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.05 కోట్లు, 2024-25లో రూ.9.87 కోట్లు, 2025-26లో రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల నికర లాభాన్ని సాధించింది. సంస్థ యాభై ఏళ్ల చరిత్రలో ఇదే అత్యధిక వార్షిక లాభంగా నిలిచింది. గతంలో నష్టాల భారంతో సతమతమైన సంస్థ ఇప్పుడు ఆర్థికంగా బలోపేతమై విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు ఉత్పత్తుల విస్తరణపై దృష్టి సారించింది. ఆర్థిక క్రమశిక్షణ, వ్యయ నియంత్రణ చర్యలు కూడా ఈ విజయానికి దోహదపడ్డాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో ఏపీహెచ్ఎంఈఎల్‌ను జాతీయ స్థాయి సంస్థగా అభివృద్ధి చేసే చర్యలు చేపట్టారు. గత ఏడాది భట్టి విక్రమార్క స్వయంగా ప్లాంటును సందర్శించి అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. సంస్థ తెలుగు రాష్ట్రాలకు మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా వ్యాపార అవకాశాలను విస్తరించుకోవాలని సూచించారు. మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కొత్త తరహా యంత్రాలు, విడిభాగాలను తయారు చేయాలని దిశానిర్దేశం చేశారు. ఉత్పత్తుల వైవిధ్యీకరణ ద్వారా కొత్త మార్కెట్లను సాధించాలని సూచించారు. ఈ చర్యలు సంస్థ పురోగతికి దోహదపడ్డాయి. గతంలో ప్రధానంగా సింగరేణి అవసరాలకు మాత్రమే యంత్రాలు, విడిభాగాలు సరఫరా చేసిన ఏపీహెచ్ఎంఈఎల్ ఇప్పుడు దేశవ్యాప్తంగా తన వ్యాపారాన్ని విస్తరిస్తోంది. భారత భారీ విద్యుత్ పరికరాల సంస్థ, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ, ఉక్కు పరిశ్రమల వంటి ప్రముఖ సంస్థలకు కూడా ఉత్పత్తులను సరఫరా చేస్తోంది. కొత్త సంస్థల నుంచి ఆర్డర్లు సాధించడం ద్వారా వ్యాపార పరిధిని పెంచుకుంది. ఉత్పత్తుల్లో నాణ్యతను పెంచడం, సమయపాలనతో సరఫరాలు చేయడం ద్వారా విశ్వసనీయతను సాధించింది. దేశవ్యాప్తంగా భారీ పరిశ్రమల అవసరాలను తీర్చగల సామర్థ్యాన్ని పెంపొందించుకుంది. దీంతో సంస్థకు మరిన్ని అవకాశాలు లభిస్తున్నాయి. 1976లో విజయవాడ సమీపంలోని కొండపల్లిలో 209 ఎకరాల విస్తీర్ణంలో స్థాపించబడిన ఏపీహెచ్ఎంఈఎల్ ప్రారంభ దశలో ఆశించిన స్థాయిలో ఆర్డర్లు పొందలేకపోయింది.

# కేదారి కుటుంబానికి సాయం

మొదటి పేజీ తరువాయి

అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో లింగాల కేదారి, పుష్పలత చేసిన సేవలను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. సాధారణ హోటల్ నిర్వహిస్తూ ఉద్యమకారులకు ఉచితంగా భోజనం, టిఫిన్లు, టీలు అందించారని పేర్కొన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని భావించి ఆహారాన్ని వృథా చేయకూడదనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశారని గుర్తుచేశారు. ఉద్యమానికి వచ్చిన వారికి ఎలాంటి భేదాభిప్రా యాలు లేకుండా సేవలు అందించారని తెలి పారు. వారి సేవాభావం తెలంగాణ సమాజంలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఉద్యమ చరిత్రలో వారి కృషి ప్రత్యేక స్థానం సంపాదించుకుందని అన్నారు. హనుమకొండలోని శాంతినగర్ పోస్టల్ కాలనీకి చెందిన లింగాల కేదారి 2026 సెప్టెంబర్ 9న, ఆయన భార్య పుష్పలత 2026 సెప్టెంబర్ 10న జరిగిన విషాదకర ఘటనలో మరణించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. వారి మరణ వార్త తెలిసిన వెంటనే పలువురు ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో సేవలం దించిన కుటుంబం ఇలా విషాదానికి గురికావ డం పట్ల పలువురు విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం కూడా ఈ ఘటనపై స్పందించి సహాయ చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక విధుల అధికారి ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షల ఆర్థిక సహా యం మంజూరు చేశారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...



# ఓరుగల్లు నగర సమగ్రాభివృద్ధిపై దృష్టి

## వచ్చే 30 రోజులు... 24 గంటలపాటు పని జరగాలి

**వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంలో వేగం పెంచండి**

**వైద్య ఆరోగ్య, పురపాలక శాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

"సీఎంవో అధికారులు నిరంతరం క్షేత్రస్థాయికి వెళ్లి సమీక్షలు చేయాలి. అధికారులు ఒక వర్క్ షెడ్యూల్ తయారు చేసుకొని ముందుకు వెళ్లాలి. ప్రతి పనిపై ఒక ప్రత్యేక అధికారికి బాధ్యత అప్పగించాలి. ఇకపై రోజూ కలెక్టర్ ఆసుపత్రి పనులను పర్యవేక్షించాలి. సనత్‌నగర్ టిమ్స్ తరహాలో ఓపీ సేవలు వరంగల్‌లో అందుబాటులోకి తీసుకురావాలి. అక్కడి మాదిరి వరంగల్‌లో కూడా సిబ్బందికి నివాస గృహాలు నిర్మించాలి. తక్షణమే స్టాఫ్ క్వార్టర్స్ పనులు ప్రారంభం కావాలి. ఆసుపత్రి నిర్వహణను ఏజెన్సీకి అప్పగించాలి"

హైదరాబాద్: వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే 30 రోజులు 24 గంటలపాటు పని జరగాలంటూ లక్ష్యం నిర్దేశించారు. వరంగల్ నగర సమగ్రాభివృద్ధిపై అధికారులు దృష్టిసారించాలని సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో వైద్య ఆరోగ్య, పురపాలక శాఖల అధికారులతో ఆసుపత్రి పనులపై సమీక్షించారు. ఆసుపత్రి భవనం పనుల్లో జాప్యంపై ఆరా తీశారు. గ్రీన్ ఛానల్‌లో నిధులు విడుదల చేస్తున్నా ఎందుకు వేగంగా జరగడం లేదంటూ సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయాలి వరంగల్ నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులపైన సమీక్షిస్తూ "వరంగల్ నగరానికి కాస్మోపాలిటన్ సిటీగా మారే అవకాశాలు ఉన్నాయి. నగర సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించాలి. భారీ నిధులతో డ్రైనేజీ పనులు చేపడుతున్నందున పకడ్బందీగా పూర్తి చేయాలి. బాహ్య వలయ రహదారిపై ప్రధానంగా దృష్టిపెట్టాలి. ఖమ్మం, వరంగల్, కరీంనగర్‌లను కలుపుతూ రహదారులు అనుసంధానించాలి. వరంగల్ విమానాశ్రయం ప్రారంభం నాటికి ఆ పనులు పూర్తిచేయాలి. హైదరాబాద్ తరహాలో ఈ నగరాన్ని అభివృద్ధి చేయాలి. ఆలయాలు, అటవీ సంబంధిత పర్యాటకాన్ని అభివృద్ధి పరచాలి. విమానాశ్రయం ప్రారంభమైతే భద్రకాళి దేవాలయం, రామప్ప ఆలయాలకు భక్తుల సంఖ్య పెరుగుతుంది. అన్ని సౌకర్యాలతో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలి' అని సీఎం సూచించారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శ్రీధర్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జె.చోంగ్తూ, సీఎంవో కార్యదర్శి మాణిక్‌రాజ్, పురపాలక శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద దేవి, చాహత్ బాజ్‌పాయ్ తదితరులు హాజరయ్యారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా జక్కుల గంగా ప్రసాద్.

**వేగుచుక్క న్యూస్,హైదరాబాద్:**

జటాధర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 2026 రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు కార్యక్రమంలో డిచ్‌పల్లి తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన జక్కుల గంగా ప్రసాద్, పీజీటీ (ఫిజిక్స్) ను ఉత్తమ ఉపాధ్యాయుడిగా సత్కరించారు. ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినకర్ బాబు, మోడల్ స్కూల్ ఏఎంఓ మంజరి చేతుల మీదుగా ఆయనకు అవార్డు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన పలువురు ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించారు.



# రోహిత్ శర్మకు ప్రపంచకప్ లైన్ క్లియర్..

## ఫిట్‌నెస్‌పై వేచి చూసే ధోరణిలో బీసీసీఐ

వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా? కొంతకాలంగా ఈ ప్రశ్నపై ఎన్నో అంచనాలు, విశ్లేషణలు వినిపిస్తూనే ఉన్నాయి. అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీకి రోహిత్‌ను ఆడించే ఉద్దేశం లేదని గతంలో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా అజిత్ అగార్కర్ దిగిపోవడం ఖాయమేనని తెలుస్తోంది. దీంతో రోహిత్‌ను వన్డేల్లో కొనసాగించడానికి లైన్ క్లియరైనట్లేనని అంతా భావిస్తున్నారు. అయితే, బీసీసీఐ మాత్రం ఈ విషయంలో ఇంకా వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. రోహిత్ ఫిట్‌నెస్‌పై ఇంకా సందేహాలు ఉండటమే ఇందుకు కారణంగా కన్పిస్తోంది. వచ్చే ప్రపంచకప్ టోర్నీకి రోహిత్ స్థానంలో యశస్వి జైస్వాల్‌ను తీసుకోవాలని అగార్కర్ కమిటీ భావించింది. అయితే, బీసీసీఐ ఇందుకు విముఖత వ్యక్తం చేసింది. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు అతడిని ఎంపిక చేసింది. మరోవైపు, రిటైర్మెంట్ ప్రచారం వేళ.. లార్డ్స్‌లో 138 పరుగుల ప్రదర్శన చేసి రోహిత్ సెలక్టర్లకు సవాల్ విసిరాడు. దీంతో అతడిని వరల్డ్ కప్ వరకు కొనసాగించేందుకే బోర్డు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. కాకపోతే రోహిత్ ఫిట్‌నెస్ విషయంలోనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 39 ఏళ్ల హిట్‌మ్యాన్ గత ఐపీఎల్ సీజన్‌లో గాయం కారణంగా వరుసగా నాలుగు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఇక, బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌లు, ఒత్తిడి లేని మ్యాచుల్లోనే అతడు అదరగొడుతున్నాడనే అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌తో టీమ్‌ఇండియా సిరీస్ కోల్పోయిన తర్వాతే.. ఆ రెండు జట్లపై రోహిత్ సెంచరీలు చేయడం గమనార్హం. ఈ పరిణామాల నేపథ్యంలో వరల్డ్ కప్ టోర్నీకి తాను అందుబాటులో,



ఫిట్‌గా ఉండగలనని నిరూపించుకోవాల్సిన బాధ్యత రోహిత్‌పైనే ఉందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ, ప్రపంచకప్ ముందు రోహిత్ ఫిట్‌నెస్ దెబ్బతింటే.. అప్పటికప్పుడు జైస్వాల్‌ను సిద్ధం చేయడం కష్టమవుతుందనే వాదనలూ ఉన్నాయి. అందుకే, ఇప్పటి నుంచే జైస్వాల్‌ను వన్డేల్లో ఆడించాలని క్రికెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు.

## అప్పటి నుంచే బీసీసీఐతో విబేధాలు!

భారత క్రికెట్‌లో ప్రధాన సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో బీసీసీఐ నిర్ణయాలపై మరోసారి చర్చ మొదలైంది. అగార్కర్ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా వచ్చిన తర్వాత వైట్‌బాల్ క్రికెట్‌లో టీమిండియా వరుసగా మూడు ఐసీసీ ట్రోఫీలు సొంతం చేసుకుంది. ఆయన హయాంలో సానుకూల అంశాలు చాలానే ఉన్నప్పటికీ, రోహిత్ శర్మ కెప్టెన్సీ తొలగింపు మొదలు అనేక వివాదాలతో అగర్కార్ పదవికి మచ్చను తెచ్చిపెట్టేలా చేశాయి. 2027 ప్రపంచ కప్ కోసం రోహిత్‌ను జట్టులో ఉంచడానికి అతను సుముఖంగా లేనప్పటికీ, బోర్డు మాత్రం ఆ ఆటగాడికి మద్దతు ఇచ్చింది. అయితే నిజానికి అగార్కర్ పదవీకాలం ప్రారంభమైన నాటి నుంచే బీసీసీఐతో సమస్యలు మొదలయ్యాయని 'ది టెలిగ్రాఫ్' తమ నివేదికలో పేర్కొంది. 'ది టెలిగ్రాఫ్' కథనం ప్రకారం.. 2023లో అజిత్ అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరిగిన రెండో సమావేశంలోనే ఓ కీలక నిర్ణయం విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అదే ఏడాది ఆగస్టులో ఐర్లాండ్‌తో జరగాల్సిన టీ20 సిరీస్ కోసం భారత జట్టును ఎంపిక చేసే సమయంలో కెప్టెన్సీ అంశం చర్చకు వచ్చినట్లు ఆ నివేదిక పేర్కొంది. ఆ సమయంలో రుతురాజ్ గైక్వాడ్‌ను భారత టీ20 జట్టుకు కెప్టెన్‌గా నియమించాలని అగార్కర్ భావించినట్లు కథనం తెలిపింది. అనంతరం జరిగిన 2023 ఆసియా క్రీడల్లో భారత జట్టుకు గైక్వాడ్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. యువ ఆటగాడికి నాయకత్వ అనుభవం అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం ఉపయోగపడేదనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. అయితే బీసీసీఐ మాత్రం జస్‌ప్రీత్ బుమ్రాను కెప్టెన్‌గా ఎంపిక చేయాలని భావించినట్లు నివేదిక పేర్కొంది. గాయం కారణంగా కొంతకాలం క్రికెట్‌కు దూరంగా ఉన్న బుమ్రా.. ఐర్లాండ్ సిరీస్‌తో తిరిగి అంతర్జాతీయ క్రికెట్‌లోకి వచ్చాడు. అతడికి ఇది పునరాగమన సిరీస్ కావడంతో బోర్డు నిర్ణయం ఆసక్తికరంగా మారింది. బుమ్రా పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని రుతురాజ్‌కు కెప్టెన్సీ ఇవ్వాలని అగార్కర్ కోరుకున్నట్లు నివేదికలో పేర్కొన్నప్పటికీ.. బుమ్రాకు నాయకత్వం వహించాలనే ఆసక్తి ఉండటంతో బీసీసీఐ అతడినే కెప్టెన్‌గా ఎంపిక చేసిందని కథనం తెలిపింది. ఇక అగార్కర్ చీఫ్ సెలెక్టర్ పదవి నుంచి వైదొలిగిన తర్వాత అతడి స్థానంలో ఎవరు రానున్నారనేది బీసీసీఐ ఇంకా చెప్పనప్పటికీ, భారత మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

# రైతులంటే ఎందుకింత నిర్లక్ష్యం?..

- గత రెండున్నరేళ్ల పాటు కృష్ణానదిలో పుష్కలంగా నీళ్లు పారినా ఎందుకు మోటర్లను నడపలేదు?
- కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు వదిలిపెట్టి.. తెలంగాణ రైతుల ప్రయోజనాలను ఎందుకు గాలికొదిలేశారు?
- జూరాల ప్రాజెక్టును పోలీసులు పూర్తిగా దిగ్బంధించి.. ఆనకట్ట పరిసరాల్లో భారీగా మోహరించారు. కనిపిస్తే అరెస్టులు చేస్తున్నారు. ఎందుకింత దౌర్జన్యం?
- రైతులు నీళ్లు అడుగుతుంటే.. వాళ్ల చేతికి సంకెళ్లు వేస్తారా?



హైదరాబాద్: 'పంట పొలాలకు సాగునీరు ఇవ్వలేని ప్రభుత్వం.. ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటు' అని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ఓ ప్రకటనలో విమర్శించారు. జూరాలలో నీళ్లున్నా రైతులకు ఇవ్వడానికి ఎందుకు మనసు రావడం లేదని, రైతులంటే ఎందుకింత నిర్లక్ష్యమని ఆయన సీఎంను ప్రశ్నించారు. "కృష్ణా జలాలను శ్రీశైలం నుంచి 738 కి.మీ. దూరంలో ఎక్కడో పెన్నా బేసిన్‌లో ఉన్న కుప్పం వరకు తరలిస్తుంటే.. పక్కనే ఉన్న పాలమూరుకు మాత్రం ఎందుకు తరలించడం లేదు? ఇది కాంగ్రెస్ పాలనా వైఫల్యం కాదా? పాలమూరు ప్రాజెక్టులో భాగంగా నార్లపూర్, ఏదుల, కరివెన, వట్టెం.. మొత్తం 50 టీఎంసీల సామర్థ్యంతో కేసీఆర్ జలాశయాలను నిర్మిస్తే.. వాటిని నీళ్లతో నింపాలన్న ఆలోచన కూడా మీకు లేదా? జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# జెండా గుడిని దర్శించుకున్న అర్బన్ ఎమ్మెల్యే.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

నగరంలోని జెండా బాలాజీ ఆలయాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితికి ముందు ఇందూరులో జెండా ఉత్సవాలు నిర్వహించడం సాంప్రదాయమన్నారు. ఎన్నో ఏళ్లుగా తాను జెండా జాతరలో పాల్గొంటున్నానని గుర్తు చేసుకున్నారు. జెండాను నగర పురవీధుల్లో శోభాయాత్రగా ఊరేగింపు తీయడం, బాలాజీ ఆలయంలో వారం రోజుల పాటు పూజించడం ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, నాయకులు మారావార్ కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు లంకతో ఇంగ్లండ్ తొలి వన్డే

శ్రీలంకను టీ20 సిరీస్‌లో వైట్‌వాష్ చేసిన ఇంగ్లండ్ జట్టు వన్డే సిరీస్‌కు రెడీ అవుతుంది. మంగళవారం దుర్హామ్ వేదికగా ఇరుజట్ల మధ్య తొలి వన్డే మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఇంగ్లండ్ తొలి వన్డేకు తుది జట్టును ప్రకటించింది. టీ20 సిరీస్‌లో ఆదిల్ రషీద్ (2 వికెట్లు) తీశాడు. అయితే తాను బౌలింగ్ చేసే చేతికి చిన్న గాయం కావడంతో తొలి వన్డేకు దూరమయ్యాడు. గాయంతో బాధపడుతున్నందున అతడి స్థానంలో 22 ఏళ్ల ఆల్‌రౌండర్ రెహాన్ అహ్మద్‌ను ఎంపిక చేసింది. ఆదిల్ రషీద్‌తో పాటు సొన్ని బేకర్, హెన్రీ క్రొకోంబె కూడా బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశముంది. ఇక టీ20ల్లో మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన టామ్ బాంటన్ వన్డేల్లో తొలిసారి ఓపెనింగ్ స్థానంలో రానున్నాడు. ఏడు వన్డేలాడిన టామ్ బాంటన్ 172 పరుగులు సాధించాడు. ఈ విధ్వంసకర బ్యాటర్ లంకతో రెండో టీ20లో 24 బంతుల్లో 52 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇంగ్లండ్ స్వదేశంలో టీమిండియాతో జరిగిన వన్డే సిరీస్‌ను 2-



1 తేడాతో నెగ్గింది. ఆ తర్వాత శ్రీలంకను మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో క్లీన్‌స్వీప్ చేసింది. ఇప్పుడు వన్డేల్లోనూ అదే తరహా జోరు ప్రదర్శించాలని బ్రూక్ సేన భావిస్తోంది. వన్డే ర్యాంకింగ్స్‌లో శ్రీలంక కంటే ఒక స్థానం తక్కువగా ఉన్న ఇంగ్లండ్ (ఏడో స్థానం) సిరీస్ గెలిచి లంకను వెనక్కి నెట్టాలని చూస్తోంది.

వేగుచుక్క





# ఏఎన్ఆర్ జయంతికి ఒక్కచోట చేరిన అక్కినేని కుటుంబం

అక్కినేని కుటుంబ సభ్యులు తాజాగా ఒకే వేదికపై సందడి చేశారు. లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులంతా ఒక్కచోట చేరారు. ఇందుకు సంబంధించిన ఫొటోను అక్కినేని నాగార్జున సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్‌గా మారింది. సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు ఉన్న అక్కినేని కుటుంబం.. ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రత్యేక సందర్భాల్లో అందరూ కలిసి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఏఎన్ఆర్ జయంతి సందర్భంగా కూడా కుటుంబ సభ్యులు ఆత్మీయంగా కలుసుకుని ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకున్నట్లు తెలుస్తోంది. దిగ్గజ నటుడి జయంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులంతా కలిసి గడిపిన క్షణాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఏఎన్ఆర్‌కు కుటుంబ సభ్యులు నివాళులు అర్పించిన ఈ ఫొటోను అభిమానులు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా పంచుకుంటున్నారు.

# ఫోన్లు పక్కనపెట్టి మాట్లాడుకోండి



నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా ప్రభావం మనుషుల మధ్య బంధాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకేచోట ఉన్నప్పటికీ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి తగినంత సమయం కేటాయించకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఆమె పేర్కొన్నారు. భాగస్వామితో కలిసి బయటకు వెళ్లిన సమయంలో కూడా ఫోన్లలో మునిగిపోవడం వల్ల బంధాల్లో కమ్యూనికేషన్ లోపించి దూరాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిజ జీవిత బంధాలకు ప్రాధాన్యంతన వ్యక్తిగత జీవితం గురించి చెబుతూ, తన భర్త గౌతమ్ కిచ్లూతో కలిసి వారానికి కనీసం ఒకరోజు డిన్నర్‌కు వెళ్తామని కాజల్ వెల్లడించారు. ఆ సమయంలో ఫోన్లను పూర్తిగా పక్కన పెట్టి కేవలం ఒకరితో ఒకరు సమయం గడపడానికి, ఆలోచనలను పంచుకోవడానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. వివాహ బంధంలో భాగస్వామి మాటలను వినడం, భావాలను పంచుకోవడం అత్యంత కీలకమని, డిజిటల్ ప్రపంచంలో నిరంతరం గడపడం కంటే చుట్టూ ఉన్న వ్యక్తులతో నేరుగా మాట్లాడటమే ముఖ్యమని ఆమె హితవు పలికారు. కాగా, కాజల్ అగర్వాల్ న్యాయవాది పాత్రలో నటించిన 'ది ఇండియా స్టోరీ' చిత్రం ఇటీవలే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో (ఓటీటీ) విడుదలైంది.

# ప్రాధాన్యం ఉంటే ఏ పాత్రలోనైనా...

పాత్ర ఎలాంటిదైనా నటనకు ప్రాధాన్యం ఉంటే ఏ తరహా పాత్రలోనైనా నటించేందుకు తాను సిద్ధమని మరాఠీ నటి భాగ్యశ్రీ బోర్సే వెల్లడించారు. అవసరమైతే విలన్ పాత్రలు చేయడానికి కూడా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆమె స్పష్టం చేశారు. ఇటీవల పాల్గొన్న ఒక ఇంటర్వ్యూలో భాగ్యశ్రీ తన సినీ ప్రయాణం మరియు కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అనుకోకుండా సినీ రంగంలోకి సాధారణంగా నటి కావాలనే ఆలోచన తనకు అసలు లేదని, బిజినెస్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసిన తర్వాత అనుకోకుండా మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టినట్లు భాగ్యశ్రీ తెలిపారు. మోడలింగ్‌లో మంచి గుర్తింపు రావడంతో, స్నేహితుల ప్రోత్సాహంతో నటన వైపు ప్రయత్నాలు చేసి అవకాశాలు దక్కించుకున్నానని ఆమె పేర్కొన్నారు. పోలికలు ఆనందాన్నిచ్చాయికెరీర్ ప్రారంభంలో కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ, 'కాంత' సినిమా నటిగా తనకు పూర్తి సంతృప్తిని ఇచ్చిందని చెప్పారు. ఆ చిత్రంలో తన నటనను 'మహానటి'లో కీర్తి సురేశ్ ప్రదర్శించిన అద్భుత నటనతో పోల్చడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత వచ్చిన 'లెనిన్' చిత్రం తనకు మొదటి విజయాన్ని అందించిందని, ప్రస్తుతం శివకార్తికేయన్ సరసన నటిస్తున్న 'సెయోన్' చిత్రంలో కూడా పెర్ఫార్మెన్స్‌కు మంచి ఆస్కారమున్న పాత్రనే పోషిస్తున్నట్లు భాగ్యశ్రీ వెల్లడించారు.



# బోల్డ్ సీన్లపై రాధికా ఆప్టే కీలక వ్యాఖ్యలు

తెలుగులో 'లెజెండ్', 'లయన్' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న ప్రముఖ నటి రాధికా ఆప్టే, సినీ పరిశ్రమలో తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న కొన్ని చేదు అనుభవాలపై స్పందించారు. ఒకసారి బోల్డ్ సన్నివేశంలో నటిస్తే, ఇకపై ఎలాంటి సన్నివేశానికైనా సరే సమ్మతి తెలియజేస్తారనే అభిప్రాయం కొందరిలో ఏర్పడటం తనను తీవ్ర అసంతృప్తికి గురిచేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నటిగా ప్రయాణంలో తన ఆలోచనా విధానం మారిందని, కథకు లేదా పాత్రకు అవసరం లేని సన్నివేశాలు చేయడానికి తాను ఇప్పుడు అంగీకరించనని స్పష్టం చేశారు. "15 సెకన్ల సీనే కదా" అనే తీరు సరికాదుబోల్డ్ సన్నివేశాల విషయంలో కొందరు మేకర్స్ వ్యవహరించే తీరును ఆమె ఆక్షేపించారు. ఒక సీన్ కథకు ఎందుకు అవసరమో స్పష్టంగా వివరించకుండా, "ఇది కేవలం 15 సెకన్ల సన్నివేశమే కదా, చేసేయండి" అంటూ మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఒక నటికి సంబంధించిన సన్నివేశాన్ని కేవలం సెకన్ల వ్యవధితో కొలవడం సరైన విధానం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఫైట్ సీన్‌లో బట్టలు విప్పమన్నారు!తన కెరీర్‌లో ఎదురైన మరో చేదు సంఘటనను గుర్తుచేసుకుంటూ, ఓ భారీ చిత్రంలో యాక్షన్ సన్నివేశం చిత్రీకరిస్తున్నప్పుడు షర్ట్ బటన్లు పూర్తిగా విప్పి నటించాలని తనపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. యాక్షన్ సన్నివేశానికి అలాంటి దుస్తులు ఎందుకు అవసరమని ప్రశ్నిస్తూ ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్లు వెల్లడించారు. తనను ఆ విధంగా నటించమని కోరిన వ్యక్తి సినీ పరిశ్రమలో ఉన్నత స్థాయిలో ఉన్న ప్రముఖ వ్యక్తి అని, ఆయన పేరు బయటపెడితే చాలామంది ఆశ్చర్యపోతారని పేర్కొన్నారు. అయితే వ్యక్తిగతంగా ఎవరినీ లక్ష్యంగా చేసుకోవడం తన ఉద్దేశం కాదని రాధికా ఆప్టే స్పష్టం చేశారు.




# మైసాగా రష్మిక ఉగ్రరూపం

నటి రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' టీజర్ తాజాగా విడుదలైంది. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిల్మ్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు గ్లామర్, రొమాంటిక్ పాత్రల్లో ఎక్కువగా కనిపించిన రష్మిక.. ఈ సినిమాలో పూర్తిగా భిన్నమైన అవతారంలో కనిపించనున్నారు. గిరిజన గోండు మహిళగా ఆమె పోషించిన పాత్రలో ఆవేశం, పోరాటం ప్రధానంగా కనిపిస్తున్నాయి. తండ్రి కోసం, తన ప్రజల హక్కుల కోసం ఓ సాధారణ యువతి తిరుగుబాటు చేసే కథాంశంతో సినిమా రూపొందుతున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. టీజర్‌లో రష్మిక బైక్ నడపడంతో పాటు నీటిలో సాహసోపేతమైన పోరాటాలు, బురదలో యాక్షన్ సన్నివేశాల్లో కనిపించారు. చిత్రీకరణ సమయంలో దాదాపు ఎనిమిది గంటలపాటు నీటిలో, బురదలో సాహసోపేతమైన విన్యాసాలు చేసినట్లు రష్మిక వెల్లడించారు. దీంతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. జేక్స్ బిజోయ్ అందిస్తున్న నేపథ్య సంగీతం, శ్రేయాస్ కె. కృష్ణ ఛాయాగ్రహణం చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈశ్వరి రావు, రావు రమేష్, సముద్రఖని, రాహుల్ రవీంద్రన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మహిళా ప్రధాన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.